క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన



ఆత్మకూరురూరల్: వెన్నువాడ ఎంపీపీఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఎంపీడీఓ శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. భోజనం నాణ్యతను పరిశీలించి సూచనలు చేశారు. సర్పంచ్ జగన్నాథం లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, హెచ్ఎం వెంగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు దశించర్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి గ్రిగ్ మెమోరియల్ క్రీడలు

కావలి రూరల్: పట్టణంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కావలి నియోజకవర్గ స్థాయిలో 98వ గ్రిగ్ మెమోరియల్ క్రీడా పోటీలను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల హెచ్ఎం ఏబీ నీరజ బుధవారం తెలిపారు. అండర్-14, 17 విభాగాల బాలబాలికలకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హాకీ, హ్యాండ్‌బాల్, త్రోబాల్, టెన్నీకాయిడ్, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో, కబ్బడ్డీ, రెజ్లింగ్, తదితర క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.

సిద్ధనపాళెంలో విష్ణుశంఖారావం

బిట్రగుంట: బోగోలు మండలంలో సిద్దనపాళెంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి విష్ణుశంఖారావం పేరుతో బుధవారం ఎన్నికల సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ముఖ్యఅనుచరులు, అభిమానులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ఎన్నికలు, గెలుపోటములతో పని లేకుండా నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యలు పరిష్కరించే లక్ష్యంతో విష్ణుశంఖారావం కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వివరించారు. విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వచనం

వింజమూరు: ఊటుకూరులో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మాదినేని శ్రీనివాసులు కుమార్తె వివాహ వేడుకకు ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి హాజరయ్యారు. వధువును ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ వింజమూరు, ఉదయగిరి మండలాల కన్వీనర్లు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి రాజారావు, స్థానిక నాయకులు కొండపల్లి రమేష్, మద్దూరి చంద్రశేఖర్‌రెడ్డి, బయ్యపురెడ్డి విజయకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల హాజరు శాతం పెంచాలి



ఉదయగిరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు శాతాన్ని పెంచేందుకు అంగన్‌వాడీలు కృషి చేయాలని గండిపాళెం సెక్టార్ సూపర్‌వైజర్ షేక్ షాను అన్నారు. మండలంలోని సర్వరాబాదు అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు,రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశా రు. అంగన్‌వాడీలు సమయాన్ని పాటించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందజేయాలన్నారు.

డేటాఎంట్రీ కోర్సులో ఉచిత శిక్షణ

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డేటా ఎంట్రీ కోర్సులో శుక్రవారం నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్కిల్ హబ్ కోఆర్డినేటర్లు శివ, శ్రీలక్ష్మి బుధవారం తెలిపారు. మూడు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. 18 నుంచి 35 ఏళ్లలోపు కలిగి, 10వ తరగతిపైన చదివిన వారు అర్హులని చెప్పారు. శిక్షణకు హాజరయ్యే వారికి రవాణా ఖర్చులు చెల్లించనున్నట్లు తెలిపారు. వివరాలకు 91827 99405, 79812 71602 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపు బైక్‌ల వేలం

ఆత్మకూరు: ఆత్మకూరు ఎస్ఈబీ కార్యాలయంలో శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ బీ నయనతార బుధవారం తెలిపారు. టీవీఎస్ ఎక్స్ఎల్, జీపీ బేరింగ్ వాహనాలను వేలం వేయనున్నామని, ఆసక్తి కలిగిన వారు ముందస్తుగా ధరావత్తు నగదు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

బాలిక అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): బాలిక అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసును బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రామ్‌జీనగర్‌లో నివాసం ఉంటున్న నాగమణి తన కుమార్తెతో కలిసి సమీపంలోని ఇళ్లలో పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. గత నెల 27న పనులకు తల్లీకుమార్తె వెళ్లారు. కొద్దిసేపటి అనంతరం బాలిక తాను ఇంటికెళ్తున్నానని, తెలిసిన వారి పెళ్లికెళ్తానని చెప్పి బయల్దేరారు. అప్పటి నుంచి ఆమె జాడ తెలియరాలేదు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం



ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి

- ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి

వరికుంటపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. తూర్పురొంపిదొడ్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా గ్రామంలో 180 కుటుంబాల ఎస్సీ, ఎస్టీలు తాము సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరగా, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ హమీద్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. రొంపిదొడ్ల గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలో సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గడప గడపకు సంక్షేమ ఫలాలు అందించి పేదల గుండెల్లో తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. నవరత్నాల ద్వారా పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు.

చంద్రబాబు పాలనంతా మోసమే

టీడీపీ అధినేత చంద్రబాబు పాలనంతా అవినీతి, మోసం, అబద్దాలతో సాగిందన్నారు. 2014 ఎన్నికల్లో హామీలను గుప్పించి అధికారం చేపట్టిన వెంటనే ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ తాను అధికారంలోకొస్తే ప్రజలకు మరింత మేలు చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో మంచి పరిపాలన సాగుతున్నప్పటికీ చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్, ఎల్లోమీడియా అసత్యాలను ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని యత్నిస్తున్నారన్నారు. ప్రజలకు అంతా తెలుసునని, వారు ఎన్ని డ్రామాలు, నాటకాలాడినా మోసపోరన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆంద్రా బాలగురవారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం, జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, స్థానిక నాయకులు బీ శ్రీనివాసులునాయుడు, గంగవరపు పుల్లయ్య, మానం మస్తానయ్య, నాదెండ్ల రంగయ్య, రాజేంద్ర, ఏనుగు వెంకటేశ్వరరెడ్డి, బొమ్ము వెంకటరెడ్డి, ఉండేల సుబ్బారెడ్డి, కాకి అంకయ్య, మాల్యాద్రి, పెండ్యాల తిరుపతయ్య, దిలీప్‌కుమార్, బాలచంద్రతో పాటు ఎంపీడీఓ విజయభాస్కర్, ఎస్సై బాలమహేంద్రనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి సహకరించండి



డిప్యూటీ సీఎం ముత్యాలునాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబును కోరారు. బుధవారం అమరావతిలో వైద్యారోగ్య శాఖ కార్యదర్శిని ఎమ్మెల్యే కలిసి ఆస్పత్రి అభివృద్ధిపై చర్చించారు. ఆత్మకూరుతో పాటు ఉదయగిరి, వైఎస్సార్ జిల్లా బద్వేల్ ప్రాంతాల ప్రజలకు ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రి వైద్యసేవలు అందిస్తుందన్నారు. రెండేళ్ల క్రితం ఆస్పత్రిని 100 పడకల నుంచి 150 పడకలకు అప్‌గ్రేడ్ చేసినా అదనపు సౌకర్యాలు కల్పించలేదన్నారు. ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని, డయాలసిస్ రోగులకు ప్రత్యేక భవనం నిర్మించాలని, అత్యవసర వైద్యసేవల విభాగంలో వైద్యసిబ్బందిని నియమించాలని కోరారు. అనంతసాగరం, మర్రిపాడు, చేజర్ల, చిత్తలూరు, సంగం పీహెచ్‌సీలలో అదనపు వసతులు కల్పించాలని, దువ్వూరు పీహెచ్‌సీకి నూతన భవనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఎస్‌పేట పీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అనంతరం గ్రామీణాభివృద్ధి శాఖ, పీఆర్ ప్రత్యేక కార్యదర్శి బీ రాజశేఖర్‌ను కలిసి ఆత్మకూరు మున్సిపాలిటీతో సమీప గ్రామాలను అనుసంధానం చేసేందుకు రోడ్ల నిర్మాణానికి రూ.37.60 కోట్లు మంజూరు చేయాలని కోరారు. సంగంలో సీసీ డ్రెయిన్స్ నిర్మాణానికి రూ.40 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీటికి మరో రూ.4 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును కలిసి అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, చేజర్ల మండల కన్వీనర్ తూమాటి విజయ భాస్కర్‌రెడ్డి, సంగం మండల నాయకుడు రఘునాథరెడ్డి, మర్రిపాడు మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, తదితరులు ఉన్నారు.

రీసర్వేను త్వరితగతిన పూర్తిచేయాలి



జక్కేపల్లిగూడూరులో భూముల రీ సర్వేను పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

బిట్రగుంట: భూముల రీసర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ కూర్మనాథ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జక్కేపల్లిగూడూరులో జరుగుతున్న భూముల రీ సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే చేపడుతున్న పొలాలను పరిశీలించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. రీసర్వేతో రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం బోగోలు-1,3 సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఉమామహేశ్వరంలో నిర్వహిస్తున్న 'స్వమిత్వ' (సర్వే ఆఫ్ విలేజ్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవ్డ్ టెక్నాలజీ ఇన్ ఏరియా) సర్వే ప్రక్రియను పరిశీలించారు. స్వమిత్వ ద్వారా గ్రామంలోని గృహాలు, స్థలాలను అత్యాధునిక టెక్నాలజీతో సర్వే చేసి యజమానుల వివరాలతో ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియతో ఇంటికి సంబంధించిన డాక్యుమెంటన్లు ఆన్‌లైన్‌లో సులభంగా పొందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఆయన వెంట కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ గోవిందారావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చిరు ధాన్యాల సాగుపై అవగాహన సదస్సు



సోమశిల: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని అనంతసాగరం మండలం బొమ్మఅగ్రహారం, చిలకలమర్రి రైతు భరోసా కేంద్రాల్లో భారత రైతు మహిళ సాధికారత-చిరుధాన్యాలపై సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జీ లక్ష్మీమాధవి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుజాత, ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ మహిళా రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఏఓ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ కారుదుంపల లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కలరెడ్డి అంకిరెడ్డి, వీఏఏలు నాగేంద్ర, రమ్య, పార్వతి, శివారెడ్డి, మురళీ, కొండయ్య, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 87శాతం పింఛన్ల పంపిణీ

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో తొలిరోజైన బుధవారం 87శాతం పింఛన్ల పంపిణీని వలంటీర్లు పూర్తి చేసినట్లు కమిషనర్ ఎం రమేష్‌బాబు తెలిపారు. 23 వార్డుల పరిధిలో 3,420 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, తొలి రోజు 2946 మందికి అందజేసినట్లు వివరించారు.

ఆత్మకూరురూరల్: మండలంలో 4,950 పింఛన్లు ఉండగా, తొలి రోజు 3,960 మందికి పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. సచివాలయాల వారీగా బోయలచిరివెళ్లలో 354, వాశిలిలో 299, నువ్వూరుపాడులో 462, అప్పారావుపాళెంలో 296, బట్టేపాడులో 373, మహిమలూరులో 486, కరటంపాడులో 469, మురగళ్లలో 381, చెర్లోయడవల్లిలో 219, రామస్వామిపల్లిలో 171, వెన్నువాడలో 332 పింఛన్లు పంపిణీ పూర్తి చేశామని వివరించారు.



ఆత్మకూరులో వేకువజామునే వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

రక్తదానంతో ప్రాణదానం

కావలి రూరల్ : రక్తదాతలు ఆపదలో ఉన్న వారి పాలిట ప్రాణదాతలని ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ చిరంజీవిరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా కావలి ఆర్టీసీ గ్యారేజ్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. కావలి ఆర్టీసీలో ఎక్కువ మంది రక్తదాతలు ఉండడంతో పాటు రాష్ట్ర స్థాయిలో అత్యధిక సార్లు రక్తదానం చేసిన వారు ఉండడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కేవీఆర్ బాబు, అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్‌కే ఖాజామొహిద్దీన్, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఉద్యోగ సంఘ నాయకులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రూ.4లక్షలతో మినరల్ వాటర్‌ప్లాంట్ నిర్మాణం

కొండాపురం: సత్యవోలు పంచాయతీ పరిధిలోని అగ్రహారంలో రూ.4లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టనున్నట్లు సర్పంచ్ పరుచూరి మాల్యాద్రి తెలిపారు. అగ్రహారంలో మినరల్ వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి బుధవారం ఆయన అధికారులతో కలిసి స్థలాన్ని శుభ్రం చేయించి కొలతలు వేశారు. గ్రామంలోని తాగునీటి సమస్య పరిష్కారానికి మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఎంపీటీసీ లెక్కల వెంకటరమణయ్య, కొమ్మి ఇంజినీరింగ్ అసిస్టెంట్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు కూలి అందేలా చూడాలి



ఉదయగిరి: ఉపాధి కూలీలకు రోజుకు రూ.257 గిట్టుబాటు కూలి అందేలా చూడాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ ఉపాధి సిబ్బందికి సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో లక్ష్యం మేరకు కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. కూలీల హాజరును ఎంఎంఎస్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఏపీఓ వీ శ్రీనివాసులు, క్షేత్రసహాయకులు, మేట్లు , తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటిని ఆశీర్వదించండి



ఉదయగిరి: తూర్పురాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోట మాజీ జెడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్, ఉదయగిరి ఉపసర్పంచ్ షేక్ ముర్తుజాహుస్సేన్ కోరారు. బుధవారం వారు మండలంలోని సచివాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాల్లోని పట్టభద్రులను కలుసుకుని ప్రచారం నిర్వహించారు. పేర్నాటి విజయానికి సహకరించాలని కోరుతూ క్యాలెండర్లు, కరపత్రాలు పంపిణీ చేశారు. పేర్నాటి పట్టభద్రులకు అండగా ఉంటారని, నిరుద్యోగుల ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన



అల్లూరు: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌రిజిస్ట్రార్ బీ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు గ్రామ,వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను ప్రారంభించేందుకు కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా సచివాలయ సిబ్బందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సీనియర్ అసిస్టెంట్ పీ వంశీకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ఉదయగిరి: మండల మినీ ట్రక్ గూడ్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక పంచాయతీ బస్టాండ్‌లోని కారు పార్కింగ్ ఆవరణలో జరిగిన సమావేశంలో అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా షేక్ నజీర్, ఎస్ చంద్రను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సుబ్బయ్య, సహాయ కార్యదర్శిగా వెంకట్రావు, కోశాధికారిగా వెంకటాద్రి, సభ్యులుగా రమణయ్య, మస్తాన్, షానవాజ్, షబ్బీర్, జాన్సన్ ఎన్నికయ్యారు. సీఐటీయూ జిల్లా నాయకుడు సురేష్ పాల్గొని మాట్లాడారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. రైతుసంఘం, సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, గడ్డం నాగేశ్వరరావు, రాజా, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై లోకాయుక్తను ఆశ్రయిస్తాం

బిట్రగుంట: కావలి నియోజకవర్గంలో జరుగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలపై లోకాయుక్తను ఆశ్రయిస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలో గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా భారీ ఎత్తున గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడిందన్నారు. టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం



నూతన విగ్రహాల వద్ద పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



కుంభాభిషేక వేడుకలకు హాజరైన మాజీ ఎంపీ మేకపాటి

సంగం: వంగల్లులోని నూతనంగా నిర్మించిన కామాక్షి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, రుద్రాభిషేకం, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పగడాల రఘురామయ్య, దాతలు దినేష్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీవాలపైకి దూసుకెళ్లిన కారు

- పది జీవాలు మృత్యువాత

సోమశిల: తుపాన్ వాహనం జీవాల మందపైకి దూసుకెళ్లడంతో పది గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన యాకర్లపాడు వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. యాకర్లపాడుకు చెందిన బొడ్డు రాజు రోజూలాగే కొండమీదకు జీవాలను మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో జీవాలు జాతీయ రహదారి దాటుతుండగా బద్వేల్ వైపు నుంచి పెంచలకోన వైపు వెళ్తున్న గుర్తుతెలియని తుఫాన్ వాహనం వాటిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పది జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. రెండు మేకలు తీవ్రంగా గాయపడ్డాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సోమశిల ఎస్సై బొజ్యానాయక్ తెలిపారు.



మౌలిక వసతులు కల్పించాలి



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నాయకులు కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో టిడ్కో గృహ సముదాయం వద్ద సమస్యలు-పరిష్కారంపై బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి యామాల మధు మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయలేదని, తాగునీరు సైతం నిత్యం అందుబాటులో లేదన్నారు. మున్సిపల్ అధికారులను పలుమార్లు కోరితే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని, వీధిలైట్లు పూర్తి స్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు బీ శేషాద్రి, రామచంద్రయ్య, స్టీఫెన్ పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కమిషనర్ ఎం రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలో పలు అనధికార లేఅవుట్లను గుర్తించినట్లు చెప్పారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కలిగిన వారు పదిహేనురోజుల్లోగా మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారిని సంప్రదిస్తే క్రమబద్ధీకరిస్తామని తెలిపారు.

శిశువు మృతదేహం గుర్తింపు

కావలి : మద్దూరుపాడులో అడవిరాజుపాళెం గ్రామానికి వెళ్లే కాలిబాట పక్కన అసంపూర్తిగా పూడ్చిపెట్టిన మగ శిశువు మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించారు. వీఆర్వో బొల్లా కేశవరావుకు సమాచారం అందజేయగా పరిశీలించి కావలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు.

మినీ వ్యాన్‌ను ఢీకొన్న లారీ

- మినీవ్యాన్‌ను డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

సంగం: మండలంలోని ర్యాంపు వద్ద ముంబాయి జాతీయ రహదారిపై బుధవారం మినీవ్యాన్‌ను లారీ ఎదురుగా ఢీకొనడంతో మినీవ్యాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న మినీ వ్యాన్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని పరారైంది. ఈ ప్రమాదంలో ఆత్మకూరుకు చెందిన మినీవ్యాన్ డ్రైవర్ పవన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని సంగం పోలీసులు 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



తీవ్రంగా గాయపడిన మినీవ్యాన్ డ్రైవర్

విషజ్వరంతో చిన్నారి మృతి

సోమశిల: అనంతసాగరానికి చెందిన 8 నెలల చిన్నారి విషజ్వరంతో బుధవారం మృతి చెందింది. షేక్ షఫీ కుమార్తె షేక్ బీబీ ఇదారిన్ జ్వరంతో బాధపడుతుండగా నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

తపాలా బీమాతో జీవితానికి ధీమా

ఆత్మకూరురూరల్: తపాలా బీమా పథకాలు ప్రజల జీవితాలకు ధీమానిస్తాయని ఆత్మకూరు సబ్‌డివిజన్ ఏఎస్పీ ఎం శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌డివిజనల్ పోస్టాఫీసులో బుధవారం నిర్వహించిన తపాలా జీవిత బీమా వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. 1884 ఫిబ్రవరి 1న తపాలా శాఖలో జీవితా బీమా పథకాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టారని తెలిపారు. ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలో రూ.1.31 కోట్లు తపాలా బీమాలు సేకరించామని వివరించారు. ప్రజలకు తపాలా శాఖపై ఉన్న నమ్మకంతో పాటు సిబ్బంది సమష్టి కృషితోనే ఈ మొత్తాన్ని సేకరించగలిగామని పేర్కొన్నారు. తపాలా బీమా పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆత్మకూరు సబ్‌డివిజన్ మెయిల్ ఓవర్సీస్ మాలకొండయ్య, వెంకయ్య, ఎస్‌టీఎంలు, బీపీఎంలు, తపాలా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ శ్రీధర్